క్లుప్తంగా

మోస్తరు వర్షం



పాలసముద్రంలో పడుతున్న వర్షం

పాలసముద్రం: మండలవ్యాప్తంగా గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. కొన్ని నెలలుగా విపరీతమైన ఎండలకు ప్రజలు ఇబ్బంది పడ్డారు. ప్రస్తుతం వాతావరణంలో వచ్చిన మార్పు వల్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో ప్రజలు సంతోష పడుతున్నారు. రైతులు మెట్టభూముల్లో కూడా వేరుశనగ సాగు చేసుకోవచ్చు. కొన్ని చోట్ల గాలి ఎక్కువగా ఉండడంతో మామిడి కాయలు నేల పాలయ్యాయి.

శ్రీవారిని దర్శించుకున్న నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్



ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

తిరుమల: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిని నగరి టీడీపీ ఎమ్మెల్యే భాను ప్రకాష్ దర్శించుకున్నారు. సోమవారం ఉదయం వీఐపీ విరామ సమయంలో కుటుంబ సభ్యులతో కలసి స్వామి వారి మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా.... ఆలయ అధికారులు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేసి పట్టు వస్త్రంతో సత్కరించారు. ఆలయం వెలుపల నగరి టీడీపీ ఎమ్మెల్యే భాను ప్రకాష్ మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో చంద్రబాబు నడిపిస్తారని ఆకాంక్షిస్తున్నామన్నారు. ఎన్డీఏ కూటమిలో ప్రధాన భాగస్వామిగా టీడీపీ ఉండడంతో రాష్ట్రానికి మంచి రోజులు వచ్చాయని అన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే పరమావధి



పోలీసు సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

చంద్రగిరి: శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా, వాటి పరిరక్షణే పరమావధిగా జిల్లా పోలీసు యంత్రాంగం పని చేస్తోందని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అన్నారు. గురువారం ఆయన చంద్రగిరి సబ్ డివిజన్, చంద్రగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో సమస్యాత్మక గ్రామాలైన కొటాల, కూచువారిపల్లి, రంగంపేట, శేషాపురం, కందుల వారి పల్లి, చిన్న రామాపురం, భీమవరం గ్రామాలను సందర్శించారు. ఈ గ్రామాల్లో ఉన్న పోలీస్ పికెట్లను తనిఖీ చేస్తూ విధి నిర్వహణలో ఉన్న పోలీసు సిబ్బందితో జిల్లా ఎస్పీ ముచ్చటిస్తూ ఏమైనా అనుమానాస్పదంగా అనిపిస్తే వెంటనే పై అధికారులకు సమాచారం అందజేయాలని సూచనలిస్తూ, అప్రమత్తం చేశారు. అదనపు ఎస్పీ కులశేఖర్, ఏఆర్ డీఎస్పీ రవీంద్ర రెడ్డి, చంద్రగిరి సీఐ రామయ్య, ఎస్ఐ అనిత పాల్గొన్నారు.

నేడు వ్యవసాయ కళాశాల వార్షికోత్సవం

తిరుపతి సిటీ: ఎస్వీ అగ్రికల్చరల్ కళాశాల 63వ వార్షికోత్సవం శుక్రవారం కళాశాల ఆవరణలో ఘనంగా నిర్వహించనున్నట్లు అసోసియేట్ డీన్ డాక్టర్ జి.ప్రభాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మి, డీన్ డాక్టర్ పి.సాంబశివరావుతోపాటు పాలకమండలి సభ్యులు హాజరవుతారన్నారు.

ధర ఉన్నా.. దిగుబడి లేదు



పుత్తూరు మార్కెట్ యార్డ్‌కు చేరిన తోతాపురి రకం మామిడి



పుత్తూరు మార్కెట్ యార్డులో లారీలకు లోడ్ అవుతున్న మామిడి

- మామిడి రైతులకు తప్పని నష్టాలు
- ఈసారి దిగుబడి మరింత దారుణం
- జూన్‌లోనే ముగుస్తున్న మామిడి సీజన్
- సిండికేట్‌గా మారిన వ్యాపారులు

- ఫ్యాక్టరీలో తోతాపురి టన్ను రూ.26 వేలు
- మండీల్లో తోతాపురి టన్ను రూ.33 వేలు
- బేనీషా రూ.45 వేలు, ఎక్స్‌పోర్ట్ క్వాలిటీ రూ.55 వేలు
- చందూర రూ.30 వేలు
- పుత్తూరు మార్కెట్ యార్డుకు చేరుతున్న మామిడి



చందూర రకం మామిడి

ఏటా మామిడి రైతు నష్టాలనే చవి చూస్తున్నాడు. ఓఏడు దిగుబడి బాగుంటే, గిట్టుబాటు ధరలేక నష్టపోవడం. ఈ ఏడు ధర ఆశాజనకంగా ఉంటే, దిగుబడి లేకపోవడం వంటి పరిస్థితులను మామిడి రైతులు ఎదుర్కొంటున్నారు. ఈ ఏడాది పుత్తూరు వ్యవసాయ డివిజన్ పరిధిలో 20 శాతం దిగుబడి మాత్రమే రావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

పుత్తూరు: సకాలంలో పూత రాకపోవడం, ఆలస్యంగా వచ్చిన పూత రాలిపోవడంతో ఆశించిన స్థాయిలో దిగుబడి రాకపోవడానికి కారణంగా రైతులు చెబుతున్నారు. పగలు అధిక ఉష్ణోగ్రతలు, రాత్రి మంచు కురవడం వంటి వాతావరణంలో ఊహించని మార్పుల వల్ల పంట దెబ్బతినిందని ఉద్యానవన శాఖ అధికారులు చెబుతున్నారు. ఏది ఏమైనప్పటికీ ఈసారి తోటల సస్యరక్షణ పేరిట పెట్టిన ఖర్చులు సైతం చేతికి అందే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. పుత్తూరు వ్యవసాయ డివిజన్ పరిధిలో 15 వేల ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. డివిజన్ పరిధిలో పుత్తూరు, వడమాలపేట, రామచంద్రాపురం, నారాయణవనం మండలాలు ఉండగా అధిక శాతం తోటలు వడమాలపేటలో ఉన్నాయి. ఈ ఒక్క మండలంలోనే ఐదు వేల ఎకరాలు ఉండగా, ఇందులో తోతాపురి రకం అగ్రభాగాన ఉన్నాయి. సాధారణంగా మంచి దిగుబడి వస్తే డివిజన్ మొత్తం మీద 45 నుంచి 50 వేల టన్నుల దిగుబడి వస్తుంది. అయితే ఈఏడు పూత సకాలంలో రాకపోవడంతో పాటు ఆలస్యంగా వచ్చిన పూత సైతం రాలిపోవడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది. ఎకరాకు కనీసం మూడు టన్నుల దిగుబడి రావాల్సి ఉండగా నేడు అరటన్ను కూడా చేతి కందేటట్లు లేదు. దీంతో డివిజన్ మొత్తం మీద దిగుబడి 10 వేల టన్నులకు లోపే పడిపోయినట్లు అంచనా. టేబుల్ వెరైటీగా పిలవబడే బేనీషా దిగుబడే లేక అన్నదాతలు అల్లాడిపోయారు. ఒకటీ, అరా మామిడి చెట్లలో కనబడే కాయలను బంధు, మిత్ర వర్గాలకు పంచేందుకే సరిపోయిందని రైతులు వాపోతున్నారు. అదీగాక జూన్ నెల ప్రారంభం నుంచి మొదలైన నైరుతి రుతుపవనాల కారణంగా ఈదురుగాలులతో కూడిన వర్షం అడప దడపా పడుతుండడంతో ఉన్న కాయలు కూడా నేలరాలుతున్నాయి. దీంతో అన్నదాతల కంట కన్నీరు సుడులు తిరుగుతున్నాయి. జూలై 15 వరకు మామిడి సీజన్ కొనసాగాల్సి ఉండగా ఈసారి దిగుబడి తగ్గిన నేపథ్యంలో మరో పది రోజుల్లో మామిడి సీజన్ పూర్తి అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

వ్యాపారుల సిండికేట్



మామిడి దిగుబడి తగ్గిన నేపథ్యంలో మార్కెట్ యార్డుల్లోని వ్యాపారులతో పాటు జ్యూస్ కంపెనీల వారు సైతం సిండికేట్ అయ్యారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించకుండా మోసం చేస్తున్నారు. వాతావరణం సహకరించక, వ్యాపారులు సహకరించకా రైతులు ఎలా బతకాలి. వ్యవసాయం జూదంలా తయారైంది. ప్రభుత్వాలు రైతుకు అండగా నిలబడకపోతే తినడానికి భవిషత్‌లో ఏమీ ఉండదు.

–టి.కేశవులు, అధ్యక్షుడు, కేబీఆర్‌పురం మామిడి రైతు సొసైటీ, పుత్తూరు

ప్రభుత్వమే ఆదుకోవాలి



నాకు ఐదు ఎకరాల మామిడి తోట ఉంది. ఎకరాకి రూ.25 వేలు వంతున రూ.1.25 లక్షలు ఖర్చు పెట్టాను. అయితే దిగుబడి ఏమాత్రం ఆశించన స్థాయిలో రాలేదు. ఇలా ఏటా నష్టపోతున్న మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. రైతుకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం చొరవ చూపాలి. వడ్డీలేని రుణాలు ఇవ్వాలి. రాయితీతో మందులు పంపిణీ చేయాలి. తోటల్లోకి శాస్త్రవేత్తలను పంపి తగిన సూచనలు ఇప్పించాలి.

– దొరైనాయుడు, రైతు, శివగిరి, పిచ్చాటూరు మండలం

పెట్టుబడి సైతం వచ్చేటట్లు లేదు



ఈ ఏడు మామిడి దిగుబడి కేవలం 10 నుంచి 20 శాతానికి మించి లేదు. తోటల సస్యరక్షణకై పెట్టిన పెట్టుబడి సైతం చేతికందే పరిస్థితి కనబడడం లేదు. వాతావరణ మార్పుల కారణంగా ఈసారి నష్టపోయాం. ఏటా మామిడి రైతు ఏదోరకంగా నష్టపోతూనే ఉన్నాడు. దీనికి తోడు మార్కెట్ యార్డుల్లో వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించకుండా మోసం చేస్తున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా మా తల రాతలు మాత్రం మారడం లేదు.

– ఎస్.చెంగయ్య, రైతు, కేబీఆర్ పురం, పుత్తూరు మండలం

చిరుధాన్యాలపై అవగాహన



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

నింద్ర: జిల్లా ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని అగరం గ్రామంలో రైతులకు చిరుధాన్యాలపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు రెడ్డిరాము, నాగమణి మాట్లా డుతూ చిరుధాన్యాల ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. అదేవిధంగా సజ్జ పంట సాగుపై తీసుకోవలసిన సూచనలు ఇచ్చారు. విత్తనశుద్ధి చేయడం వల్ల రైతులకు మేలు జరిగే అంశాలను వివరించారు. రైతులు సజ్జపంటలో కలుపు నివారణపై, సస్యరక్షణపై వివరించారు. అనంతరం రైతులకు సజ్జ విత్తనాలు, విత్తనశుద్ధి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ ఏడీఏలు నాగపద్మని, సౌభాగ్యలక్ష్మి, ఏఓలు యామిని, పద్మజ, ప్రసన్న లక్ష్మి, తులసీరాం, రైతులు పాల్గొన్నారు.

గురుదక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో గురుదక్షిణామూర్తి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని గురుదక్షిణామూర్తికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గురుదక్షిణామూర్తికి పలు రకాల అభిషేకాలు, అలంకరణలు చేపట్టారు. అనంతరం ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని, మొక్కులు చెల్లించుకున్నారు. పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ ఎస్వీ నాగేశ్వరరావు, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం

కార్వేటినగరంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరిరోజు గురువారం ఉదయం చక్రస్నానం వేదోక్తంగా జరిగింది. ఉదయం మూలవరులకు చూర్ణాభిషేకం నిర్వహించారు. చక్రస్నానం సందర్భంగా చక్రతాళ్వార్, రుక్మిణి, సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం శాస్త్రోక్తంగా జరిగింది. రాత్రి పల్లకిపై స్వామి వారు పుర వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు.

–కార్వేటినగరం



స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న వేదపండితులు



పల్లకిపై విహరిస్తున్న వేణుగోపాలుడు.



ధ్వజావరోహణం నిర్వహిస్తున్న వేదపండితులు

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి



జీడీ నెల్లూరులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, అధికారులు

గంగాధర నెల్లూరు: బాల కార్మికుల చట్టం 1986 ప్రకారం 14 ఏళ్లలోపు పిల్లలు దుకాణాల్లో పని చేయకూడదని, బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని మండల విద్యాధికారి ఆంజనేయులు శెట్టి, సీఐ మారుతి శంకర్ అన్నారు. గంగాధర నెల్లూరు మండల కేంద్రంలో వారు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల కార్మికులు దుకాణాలు, హోటళ్లలో పని చేయకూడదని, ప్రతి ఒక్కరూ చదువుకోవాలని సూచించారు. 14 ఏళ్లలోపు పిల్లలను వాణిజ్య సముదాయాల్లో, దుకాణాల్లో ఎవరైనా పనికి పెట్టుకుంటే ఆ యజమానులకు కఠిన శిక్ష విధిస్తామని తెలిపారు. అనంతరం జీడీ నెల్లూరు పోలీస్ స్టేషన్ నుంచి మండల కేంద్రం వీధుల్లో దుకాణ యజమానులకు అవగాహన కార్యక్రమం కల్పించారు. కార్యక్రమంలో డీసీపీయూ సిబ్బంది మురళి, ఉమాదేవి, సబిత, పూర్ణచంద్ర, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మంగళంలో టీడీపీ నాయకుల దౌర్జన్యం





వాటర్ ప్లాంట్‌లో టీడీపీ నాయకులు విరగ్గొట్టిన కుర్చీలు, ధ్వంసమైన సీలింగ్ ఫ్యాన్

- వైఎస్ఆర్ సీపీ నాయకుడికి చెందిన వాటర్ ప్లాంట్ ధ్వంసం

తిరుపతి మంగళం: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడడం, టీడీపీకి భారీ విజయం చేకూరడంతో టీడీపీ నాయకుల దాడులు మొదలయ్యాయి. మంగళంలోని పంచాయతీ డివిజన్ అధ్యక్షుడు, వైఎస్ఆర్ సీపీ నాయకుడు చిలమంద హరికృష్ణ నిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్పై దాడికి స్థానిక టీడీపీ నాయకులు దాడి చేశారు. వాటర్ ప్లాంట్‌లోని కుర్చీలు, ఫ్యాన్లు, టేబుల్ ధ్వంసం చేశారు. అనంతరం వాటర్ ప్లాంట్‌కు తాళాలు వేసుకుని వెళ్లారు. ఫలితాలు విలువడిన 48 గంటల్లోనే టీడీపీ నాయకులు చేస్తున్న అరాచకాలను చూసి స్థానిక ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

పనపాకంలో ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం

చంద్రగిరి: పనపాకం పంచాయతీ కార్యాలయం వద్ద టీడీపీ కార్యకర్తలు ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసిన ఘటన గురువారం చోటు చేసుకుంది. పంచాయతీ కార్యాలయం సమీపంలోని వైఎస్ఆర్ సీపీ జెండా దిమ్మెతోపాటు బెంచీలు, చెత్త సేకరణ ఆటోను ధ్వంసం చేశారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడంతో పాటు దౌర్జన్యాలకు పాల్పడడంపై ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం టీడీపీ కార్యకర్తలు చేస్తున్న దౌర్జన్యాలపై ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.



పనపాకం పంచాయతీ కార్యాలయ సమీపంలోని వైఎస్ఆర్ సీపీ జెండా దిమ్మె, బెంచీ ధ్వంసం చేసిన దృశ్యం



బెంచీలు, ఆటో ధ్వంసం

వెంటాడుతున్న నకిలీ భూతం

- విత్తనాలు, ఎరువులు కొనుగోలులో జాగ్రత్త
- మార్కెట్‌లో విచ్చలవిడిగా నకిలీలు

భాకరాపేట: ఖరీఫ్‌లో వివిధ పంటలను సాగు చేసే రైతన్నలు ముందస్తుగా విత్తనాలు ఎరువులు, క్రిమిసంహారక మందులు కొనుగోలు చేస్తుంటారు. ఇలాంటి సమయంలోనే అనుమతులు లేని కంపెనీ విత్తనాలు, ఎరువులు మార్కెట్‌లోకి వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి. నియోజకవర్గంలోని వివధ ప్రాంతాల్లో నకిలి విత్తనాలు అమ్మకాలకు సిద్ధంగా ఉన్నాయన్న సమాచారంతో వ్యవసాయ శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేస్తున్నారు. కాబట్టి రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ కోరుతోంది.

- ఒకటికి రెండు మార్లు ఆలోచించి అన్ని వివరాలను పరిశీలించిన తరువాత కోనుగోలు చేయాలి. విత్తనాలు ఎరువులు మందులు కోనుగోళ్లలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇవి....
- లైసెన్సు లేని వ్యక్తులు దుకాణాలు దళారులు ఇతరత్రా ఎక్కడ పడితే అక్కడ కోనుగోళ్లు చేయకూడదు.
- సరుకు లాట్ నంబరు, తయారు తేదీ, రకం, ఇలా అన్ని వివరాలు కలిగి ఉండి సంతకం చేసిన బిల్లును విక్రయదారుల నుంచి తప్పనిసరిగా పోందాలి
- సంచులపై సీలు విప్పినట్లు లేదా, విప్పదీసి తిరిగి కుట్లు వేసినట్లు కనిపిస్తే అలాంటి వాటిని తీసుకోకూడదు.
- వ్యవసాయ శాఖ అనుమతి పోందిన డీలర్లు, వ్యవసాయ మార్కెట్ కమిటీలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల నుంచి మాత్రమే ఎరువులును కొనుగోలు చేయాలి
- విత్తనాలు కోనుగోలు చేసేటప్పుడు విత్తన బస్తాతో లభించే చీటీ (ట్యాగ్) ఉందో లేదో గమనించి ఉన్నది మాత్రమే తీసుకోవాలి. ఆ చీటీని ఏడాదిపాటు భద్రంగా ఉంచుకోవాలి
- క్రిమి సంహారక మందుల డబ్బాపై కంపెనీ పేరు తయారు తేదీ కాల పరిమితి గమినించి అందుకు అనుగుణంగా బిల్లులు తీసుకోవాలి
- ఏది ఎంత ధరకు కొన్న డీలర్ లేదా దుకాణదారుడు సంతకంతో బిల్లు పొందాలి. నకిలీవి అని అనుమానం వస్తే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలి. ఉచితంగా నకిలీ నిర్ధారణ పరీక్షలు చేయించవచ్చు.
- లైసెన్సు లేకుండా విత్తనాలు ఎరువులు మందులు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలి. తక్షణం వారు స్పందించి న్యాయం చేస్తారు. లేదంటే రైతు నష్టపోయే అవకాశం ఉంది.
- నకిలీవి అని తేలితే విత్తనం ఎరువులు క్రిమిసంహారక చట్టాల ప్రకారం సంబంధిత డీలరు, కంపెనీ, దుకాణదారునిపై వెంటనే కేసు నమోదు చేస్తారు.



అనుమతులు లేని విత్తనాల కొనుగోలు చేయొద్దు



ప్రభుత్వ అనుమతులు లేని విత్తనాలను కోనుగోలు చేసి రైతులు మోసపోరాదు. బ్యాచ్ నెంబరు లేని పురుగు మందులు కోనుగోలు చేయరాదు, విత్తనాలు, ఎరువులు కోనుగోలులో ఎలాంటి సందేహాలు ఉన్నా మమ్మల్ని సంప్రదించాలి. విత్తనాలు, ఎరువులు కోనుగోలు చేసేటప్పుడు కచ్చితంగా దుకాణదారుడు నుంచి బిల్లు విధిగా తీసుకోవాలి. – ధనలక్ష్మి, వ్యవసాయాధికారి, చిన్నగొట్టిగల్లు మండలం

నిందితులను అరెస్టు చేయాలి

తిరుపతి కల్చరల్: ఓటేరు హైవే రోడ్డు గుజిరి షాపులో పని చేసే సెక్యూరిటీని పంచడానికి ప్రయత్నం చేసిన రౌడీమూకలను వెంటనే అరెస్ట్ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ నేతలు ఓటేరు హైవే వద్ద దాడి జరిగిన సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్తి కోసం గుజిరి వ్యాపారస్తుడికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా తేజస్‌నాయుడు అనే అతను రౌడీలను తీసుకొని వచ్చి అర్ధరాత్రి గుజిరి షాపులో పెట్రోలు పోసి అగ్గి పెట్టారని పేర్కొన్నారు. అక్కడ ఉన్న బండ్లు కూడా కాలిపోయాయని తెలిపారు. నెల రోజుల నుంచి అతనిని అరెస్ట్ చేయలేదన్నారు. ఎన్నికల కౌంటింగ్ రోజు అర్ధరాత్రి 15 మంది కత్తులు ఇనుప రాడ్లు తీసుకొని వచ్చి అక్కడ ఉన్న సెక్యూరిటీ గార్డు, అక్కడ పనిచేసే ఒక పెద్దాయనపై దాడి చేసి ఇన్నోవా కారులో ఎత్తుకెళ్లి భరత్‌ను తీవ్రంగా గాయపరిచి, గాజులమండ్యం ఏరియాలో వదలివెళ్లి గుజిరి షాపును ధ్వంసం చేశారని తెలిపారు. దాడి చేసిన వారిని తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సీపీఐ నేతలు విశ్వనాథ్, చిన్నం పెంచలయ్య, రాధాకృష్ణ, పద్మనాభరెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.